# హృదయంలో దీపం పెట్టకు

**ఇక్కడ** దీపాలు వెలిగించకూడదు.

ప్రశ్నలు విన్పించకూడదిక్కడ.

ఇక్కడ చూపుడువేలు కన్పించకూడదు.

ఈ కత్తుల తోటలో ఏం జరిగినా ఎవరూ తొంగిచూడకూడదు.

ఈ నెత్తుటి నదులు ఎక్కడివో ఆరా తీయకూడదు.

మనందరం మనుషులమని ఎవరూ ఇక్కడ గుర్తు చేయకూడదు.

ఇలా అని ఏలినవారు దండోరా వేయించరు.

రాజపత్రంలో రాయించరు.

కానీ....

న్యాయస్థానాలలోని నల్లని చీకటి సాక్షిగా, పోలీసు ఠాణాల్లోని ఖాకీ చీకటి సాక్షిగా, చట్టసభల్లోని ఖద్దరు చీకటిసాక్షిగా, జాతీయ పతాకంలోని మూడు రంగుల చీకటి సాక్షిగా ఈ న్యాయం ఇక్కడ అమలు జరుగుతోంది.

బాలగోపాలుడొక తాజా ఉదాహరణ.

ఇప్పటికే నెత్తురోడుతున్న ప్రజాస్వామ్యానికి ఇది మరో కొత్తగాయం.

ప్రాథమిక హక్కుల నుదుట ఒక బాయినెట్ గాటు.

రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్న వాళ్లపై పాలకులు కన్నెర్ర జేస్తున్నారు.

కుట్ర కేసుల్లో ఇరికిస్తున్నారు.

ఇది ప్రభు వర్గాలు పన్నిన సరికొత్త కుట్ర.

ఇది కుట్రదారుల సరికొత్త ఎత్తుగడ.

ప్రమాదకరమైన కొత్త పన్నుగడ.

చిల్లర దొంగలనైనా, తిరుగుబాటు దారులనైనా, ఎవరినైనా సరే చట్టప్రకారం దోషులని ప్రకటించి, చట్టప్రకారం విచారణ జరిపించి, చట్ట ప్రకారం శిక్షించవలసి ఉంది. అధికారాన్ని అమలు చేయడానికీ, పిడికిలి ప్రయోగించడానికీ చట్టమనేది ఒక పరిమితి విధిస్తోంది.

ప్రతీ అరెస్టును న్యాయస్థానానికి నివేదించాలనడం, ప్రతీ ఆరోపణను రుజువు చేసుకోవాలనడం, సాక్ష్యం కావాలనడం, ప్రతీదాన్నీ సజావుగా న్యాయస్థానంలో విచారించాలనడం మారాజులకీ, వారి బలగాలకీ నామర్దా, నామోషీ, యథేచ్ఛగా పరిపాలించుకుంటూ, శాంతి భద్రతలని అవలీలగా అదుపు చేసుకుంటూ.

"ఊరి మొత్తానికీ ఒక్కడే రౌడీ ఉండాల. వాడు గవర్నమెంటోడే కావాల"ని ప్రకటించుకుంటూ, మీసాలు హోషుగా సవరించుకుంటూ తిరగడానికి వీలు కాకపోవడం బేహద్బీ.

ప్రజాస్వామ్యం, పౌరహక్కులూ వీటివల్లనే గదా మన రాజమార్గాలలో
ఎన్ని నియమాల గులకరాళ్లు అని వారు చాలా ఆగ్రహించారు.
ఫలితంగా ఇంతవరకు విప్లవకారులకీ, విప్లవ రచయితలకీ పరిమితం.
చేసిన కుట్ర కేసులను పౌరహక్కుల సంఘం మీద కూడా ఎక్కుపెట్టారు.
పాలకులు చేపట్టిన ఈ కొత్త యుద్ధతంత్రం ఇపుడింకా ఏ దశలో సాగుతుంది?
ఏ దశలో సాగుతుందంటే
పౌరహక్కుల సంఘం మీద కాదు వాళ్ళ అలక, పౌరహక్కుల మీద.
పౌరహక్కును ప్రసాదించిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల
అధ్యాయం మీద
ఆ అధ్యాయాన్ని ప్రసాదించిన రాజ్యాంగం మీద.
ఆ రాజ్యాంగం ప్రసాదించిన రాజ్యాంగసభ మీద.
ఆ రాజ్యాంగ సభను నిర్మించిన ప్రజాస్వామ్యం మీద.

ప్రజాస్వామ్యం మీద వారి అలక.

ప్రజాస్వామ్యం మీద వారి క్రోధం.

ఈ కోపం తీరడానికి వాళ్లేం చేయవచ్చును?

చాలా చేయవచ్చును.

చేతిలోని కత్తిని రకరకాలుగా ప్రయోగించవచ్చును.

న్యాయమనీ, సాక్ష్యమనీ, రుజువులనీ కోర్టులు పలుమార్లు చికాకు పెట్టినట్లయితే రాజభటులకు మేజిస్ట్రేట్‌గారింట బాంబులు దొరకవచ్చును.

జడ్జిగారి చాంబర్లో విద్రోహకరమైన 'కుట్ర' జరిగినట్లు నమ్మకంగా ఏలినవారికి తెలియవచ్చును. రాజద్రోహులకు రాజ్యాంగంలోని చాలా అధ్యాయాలూ, అధికరణాలూ కచ్చితంగా సహాయపడుతున్నట్లు తోచి, ప్రాథమిక హక్కులను వివరించే చాలా సెక్షన్లు 'విప్లవ సాహిత్యం' కింద కన్పించవచ్చును.

వీటన్నింటినీ వేలెత్తి చూపే వార్తాపత్రికల శీర్షికల్లో బాంబులు, 'పేలుడు పదార్థాలూ' కచ్చితంగా లభించవచ్చును.

ఆ రకంగా జరిగి....

విశాలమైన, చీకటిమయమైన ఊపిరాడక ఒకే ఒక భయంకరమైన కారాగారంలో బాలగోపాలులూ, న్యాయమూర్తులూ, రాజ్యాంగమూ, వార్తాపత్రికలూ పక్కపక్క గదుల్లో పడి మగ్గవచ్చును.

సరికొత్త యుద్ధతంత్రం ఆ దశకు చేరుకోవచ్చును.

**- కె.ఎన్.వై. పతంజలి**

02-02-1985

'పతంజలి' భాష్యం నుంచి

(1985లో బాలగోపాల్‌ను అరెస్టు చేసి సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్‌లో ఉంచినప్పుడు)